క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో నేడు (బుధవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్, మాంగల్య షాపింగ్ మాల్, దక్కన్ టవర్, రమేష్ స్కిన్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో డీఈ పేర్కొన్నారు.

రావు పద్మను కలిసిన 'అరూరి'



హన్మకొండ : బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెతో పాటు పార్టీ నాయకులతో జిల్లాలో రాజకీయ పరిస్థితులు, అనుకూల, ప్రతికూల అంశాలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. పార్టీ సీనియర్ నాయకుడు రావు అమరేందర్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, రావు పద్మ దంపతులను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

అరూరిని కలిసిన బీజేపీ నేతలు

వరంగల్ : బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ 14వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు దండు చక్రపాణి, పస్తం సమ్మయ్య, దామెర సదానందం, అశోక్, ఎల్లంశెట్టి వీరస్వామి, కూచన భిక్షపతి, పిట్ట సరస్వతి, ఓర్సు దేవేందర్, చల్ల రాజు, తరాల కుమార్, సాంబయ్య, సూర రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్యాంపు కార్యాలయంలోకి మంత్రి

కాశిబుగ్గ : రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఓ సిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలోకి నేడు (బుధవారం) అడుగుపెట్టనున్నారు. కొండా సురేఖ తూర్పు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి చేపట్టిన ఇంతవరకు అధికారిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి రాలేదు. దీంతో తూర్పు ప్రజలు మంత్రిని కలవాలంటే హైదరాబాద్‌కు లేదా హనుమకొండకు వెళ్లాల్సి వచ్చేది. ఈక్రమంలో మంత్రి తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి రానుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిధర్‌రావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.

నిరసన

న్యూశాయంపేట : స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్(ఎస్ఐఓ) వరంగల్ సిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇజ్రాయెల్ వస్తువులను బహిష్కరించాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. గాజాలో ఇజ్రాయెల్ మూకలు ముస్లింలపై దాడులకు పాల్పడుతూ, హతమారుస్తున్నందుకు నిరసనగా కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ఐఓ వరంగల్ బాధ్యుడు ఫయిముద్దీన్ సూఫీ తెలిపారు. ఇర్ఫాన్ ఉన్నారు.

కూలర్ల బహూకరణ

కాశిబుగ్గ /ఎంజీఎం : రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె, కొండా సుస్మిత పటేల్ జన్మదినం సందర్భంగా సీకేఎం ఆస్పత్రికి కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్‌రాజు నాలుగు కూలర్లను బహూకరించారు. అనంతరం గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు.

రోడ్లు ధ్వంసమవుతున్నాయి

- భారీ వాహనాల రాకతో ఇబ్బందులు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

మడికొండ : భారీ వాహనాల రాకతో రోడ్లు ధ్వంసమవుతుంది.. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కానరాక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కాజీపేట మండలంలోని మడికొండ నుంచి ధర్మసాగర్ వైపునకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మడికొండ మీదుగా లారీలు, టిప్పర్లు ఎదురుగా రావడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే స్థానిక పోలీసు అధికారులు రెండు, మూడు రోజుల పాటు భారీ వాహనాలను గ్రామంలోకి రాకుండా చూస్తున్నారు. ఆ తర్వాత యథావిధిగా భారీ వాహనాలు మడికొండలోకి వస్తున్నాయి. దీంతో రాత్రి వేళ వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల పెద్దమ్మతల్లి ఆలయం వై జంక్షన్ వద్ద లారీ ఢీ కొట్టడంతో యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన విషయ విదితమే. వై జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు భారీ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన మడికొండ-ధర్మసాగర్ రోడ్డు

భారీ వాహనాలు నిలిపివేయాలి



మడికొండ గ్రామంలోకి భారీ వాహనాలు రావడంతో ప్రయాణానికి, స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రోడ్డు ప్రమాదాలు జరిగితేనే పోలీసులు కొద్ది రోజులు లారీలను ఆపి వేసి తర్వాత మర్చిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా నిలిపివేయాలి.

\- దార ధనుంజయ్, స్థానికుడు

ఎస్ఎఫ్ఐ కూటమి విజయంపై హర్షం

- కేయూ మొదటి గేట్ వద్ద సంబురాలు

కేయూ క్యాంపస్ : ఢిల్లీలోని జేఎన్‌యూలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ కూటమి గెలుపొందడంతో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద ఎస్ఎఫ్ఐ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సంబురాలు నిర్వహించుకున్నారు. పరస్పరం స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. మతోన్మాద సంఘాలు ఎన్ని కుట్రలు చేసినా ఎస్ఎఫ్ఐ కూటమి విజయాన్ని ఆపలేక పోయారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నూతన జాతీయ విద్యావిధానంపై కూడా వ్యతిరేకత పెల్లుబీకుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు సాయికిరణ్, జనరల్ సెక్రటరీ స్టాలిన్, ఉపాధ్యక్షురాలు పరిమిళ, మంద వికాస్, అనూష, మంధు, హాథిరాం, జస్వంత్, మంగిలాల్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



సంబురాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎమ్మార్పీఎస్ కార్యక్రమాల విస్తరణ

హన్మకొండ : రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ (మేడి పాపయ్య) కార్యక్రమాలను, ఎమ్మార్పీఎస్‌ను విస్తరిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, దళిత రత్న కేదాసి మోహన్ తెలిపారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ (మేడి పాపయ్య) ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. మాదిగల లక్ష్య సాధనకు పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొమ్ముగిరి దాసు మాదిగను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మెట్టుపల్లి కొమురయ్య, పాలుమారి బాలస్వామి, బొట్ల ర మేష్, కొమ్ముల భిక్షపతి, చింత జోసెఫ్, ఎర్రోళ్ల సు దర్శన్, వేల్పుల ఆంజనేయులు, కొంగర స్వామి, వక్కల కుమార్, కాయిత ప్రసాద్, మంచాల వెంకన్న, వెంకటస్వామి, ల్యాదళ్ల ఆనందం, నమిండ్ల కెల్‌మెంట్, సురేందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

నల్లబెల్లి : హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమని రాంపూర్ మాజీ సర్పంచ్ చింతపట్ల సురేశ్ అన్నారు. మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి యాజమాన్యం స్వగ్రామంపై మమకారంతో సేవా కేంద్రం ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యసేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి మండలంలోని మేడపల్లి, రాంపూర్, తదితర గ్రామాల ప్రజలు చేరుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చెందిన ఆర్థో, గైనిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజిషియన్, చిల్డ్రన్, అంకాలజీ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ శిల్పరెడ్డి, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మణి సేవారణ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఖలీల్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ బాలరాజ్, డాక్టర్ రవికుమార్, స్థానిక నాయకులు మార్తినేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం న్యూశాయంపేటకు చెందిన ఆటో డ్రైవర్ కొట్టె అశోక్ ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి శ్రీరాజ రాజేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రూ. 30వేల ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వేల్పుల సాంబమూర్తి, ఉపాధ్యక్షుడు బోళ్ల సునీల్, రాసమల్ల సురేష్, సత్యం, వెంకట్, లక్ష్మణ్, ప్రతాప్ ఉన్నారు.



సాయం అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



మాధవి



అనిత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు మహిళా పరిశోధకులకు మంగళవారం డాక్టరేట్‌ను ప్రకటించారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో కె.మాధవికి, చరిత్ర విభాగం పరిశోధకురాలు ఈదుల కంటి అనితకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 'స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ డిస్ ప్లేస్‌మెంట్ ఏ స్టడీ ఆఫ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు గాను కె.మాధవికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఆవిభాగం రిటైర్డ్ ఆచార్యులు బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. 'ది రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్‌ద లెఫ్టిస్ట్ మూవ్‌మెంట్ ఇన్ తెలంగాణ ఏ స్టడీ' అనే అంశంపై ఆ విభాగం ఆచార్యులు పి.సదానందం పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికిగాను ఈదులకంటి అనితకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆచార్య నర్సింహాచారి తెలిపారు.

ఎల్ఎల్ఎం పరీక్షల పరిశీలన

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కళాశాల పరీక్షా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎల్ఎల్ఎం పరీక్షల నిర్వహణ తీరును కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ విధానంలో ఎలాంటి అవకతకవలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్ తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వరంగల్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి సూచించారు. ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం విద్యార్థులకు మత్తు పదార్థాలతో పాటు వాటి నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకుంటే కేసులు నమోదు అయితే ఉద్యోగాలకు అనర్హులవుతారన్న విషయాలను గుర్తుపెట్టుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నారా లేదా అనే విషయాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డీడీ సీతారాములు, ప్రిన్సిపాల్ ఎల్.జుమ్లానాయక్, ఏటూరునాగారం ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు, ట్రైనింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపి

విద్యార్థులను అభినందించిన కలెక్టర్



కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో విద్యార్థులు

హన్మకొండ అర్బన్ : హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందుకున్న నగరంలోని బాలసముద్రంలో గల గురుకుల్ స్కూల్ విద్యార్థులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ అభినందించారు. మంగళవారం గురుకుల్ స్కూల్ విద్యార్థులు, యాజమాన్యం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు, విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని యూనిఫైడ్ క్యాష్ అవార్డు, సుచిర్ ఇండియా యంగ్ జీనియస్ అవార్డు, ఇన్‌స్పైర్ మ్యాక్ అవార్డు, క్వెస్ట్ ఒలింపియాడ్ క్యాష్ అవార్డు, నంది అవార్డులను అందుకున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులు భవిష్యత్‌లో కూడా చదువుల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, పోటీల్లో ప్రతిభ చాటాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు

హసన్‌పర్తి : మండలంలోని ఎల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాఠశాల ఆవరణలో రాత్రి వేళ మద్యం తాగి విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో పాఠశాల వరండాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారన్నారు. సోమవారం హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్న కొంతమంది మద్యం ప్రియులు పూటుగా తాగిన మత్తులో పాఠశాలలో ఏర్పాటు చేసిన నల్లాలను విరగొట్టి ధ్వంసం చేశారు. పదేళ్లుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు స్పందించడం లేదని గ్రామస్తులు తెలిపారు. రాత్రి వేళ ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ధ్వంసం చేసిన నల్లా

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హన్మకొండ : పరకాల నియోజకవర్గ పరిధి సంగెం మండలం, పరకాల పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హనుమకొండ భవానినగర్‌లోని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరగా ప్రకాశ్ రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. సంగెం ఎంపీపీ కందగట్ల కళావతి, రైతు బంధు మండల అధ్యక్షులు కందగట్ల నరహరి, ఎంపీటీసీ సభ్యుడు మెట్టుపల్లి మల్లయ్య, నల్లబెల్లి ఎంపీటీసీ కట్ల సుమలత, మాజీ వైస్ ఎంపీపీ కాగితాల జయలక్ష్మి జగన్నాథచారి, మాజీ సర్పంచ్‌లు కావటి వెంకటయ్య, మాధినేని రాంరెడ్డి, పత్తిపాక రమేశ్, రాయపురం మల్లికాంబ ఎల్లయ్య, రౌతు నాగయ్య, సంగెం పీఏసీఎస్ డైరెక్టర్ గోపతి రాజు, నాయకులు కన్నెబోయిన రాజు యాదవ్, గుర్రం సాంబయ్య, ఎ.రమేశ్ తోపాటు, మాజీ ఉపసర్పంచ్‌లు, మాజీ వార్డు సభ్యులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల పట్టణానికి చెందిన నాయకులు బండి శ్రీధర్, బండారి కృష్ణతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే మొలుగురి భిక్షపతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా.. మహిళా కూలీలకు గాయాలు

ఖిలా వరంగల్ : అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడి పలువురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. ఉర్సు కరీమాబాద్‌కు చెందిన ఆవునూరి సునీత, నాగపూరి ఉమ(మౌనిక), యాకలక్ష్మి, మరుపల్లి దేవి, రెహన్, జయ సోమవారం వసంతాపురం గ్రామానికి పత్తి ఏరేందుకు ఆటోలో కూలికి వెళ్లారు. సాయంత్రం ఉర్సు కరీమాబాద్‌కు బయల్దేరారు. ఈక్రమంలో రోడ్డుపై వెళ్తున్న ఆటోను ఇమ్మడి ప్రభాస్ అనే వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టి పరారయ్యాడు. దీంతో ఆటో బోల్తా పడగా ఆవునూరి సునీత, నాగపూరి మౌనికకు తీవ్రగాయాలయ్యాయి. మరో నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిందరిని 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన ఆటో డ్రైవర్ ప్రభాస్, ద్విచక్ర వాహనదారుడు ప్రమోద్‌లపై చర్యలు తీసుకోవాలని ఆవునూరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పలువురిపై కేసు నమోదు

హోలీ పండుగ సందర్భంగా సోమవారం మధ్యకోట గుండుచెరువులోకి స్నానానికి వెళ్లిన ముగ్గురిపై అమానుషంగా దాడిచేసిన పదిమంది యువకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. మధ్యకోటకు చెందిన మేకల రాజ్‌కుమార్, బోరబోయిన కార్తీక్, దేవబోయిన నాగరాజు హోలీ ఆడుకున్నారు. మధ్యాహ్నం గుండు చెరువులోకి స్నేహితులతో కలిసి వారు స్నానానికి వెళ్లారు. చెరువు వద్ద బొల్లం కార్తీక్, తాడుల భరత్, పుట్ట మహేష్, కుంజనపల్లి యశ్వంత్, తంగళ్లపల్లి నిఖిల్, పుప్పాల సంజయ్, పుప్పాల శ్రీధర్, కళ్యాణ్, సచిన్, గాదం భరత్ కలిసి మద్యం తాగుతున్నారు. మద్యం మత్తులో ఉన్న పదిమంది ఇటు ఎందుకు వచ్చారురా.. అంటూ దుర్భాషలాడుతూ ముగ్గురిపై దాడి చేశారు. అనంతరం మాట్లాడుకుందామని సాయంత్రం పడమరకోట పద్మశాలీ వీధికి పిలిచి బీరు సీసాలు, కర్రలతో దాడి చేయగా మేకల గణేష్ తలకు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. మధ్యకోట యాదవనగర్‌కు చెందిన మేకల గణేష్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

ఇద్దరిపై కేసు..

హోలీ వేడుకల్లో దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. కరీమాబాద్ తోట్లవాడకు చెందిన శామంతుల సుమంత్, పల్నాటి సాయిరాం, పల్లం మనితేజ్ కలిసి పడమరకోట జంక్షన్‌కు వెళ్లారు. స్నేహితులతో కలిసి మాట్లాడి బైక్‌పై వెళ్తున్న ముగ్గురిపై బొల్లం కార్తీక్, నిఖిల్ దాడి చేసి గాయపర్చారు. బాధితుడు శామంతుల సుమంత్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై కేసు..

బైక్‌ను ఢీకొట్టిన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. నర్సంపేటకు చెందిన చొప్పరి చంటి (20) సిద్దార్థ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుక్స్ కొనేందుకు ఈనెల 20న నర్సంపేట నుంచి ద్విచక్రవాహనంపై వరంగల్ వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో నర్సంపేట రోడ్డు లేబర్ కాలనీలో ఆర్టీసీ బస్సు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చంటికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఎంజీఎం తరలించారు. బస్సు డ్రైవర్‌పై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని చంటి తండ్రి చొప్పరి శ్రీనివాస్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. స్థానిక జీఆర్‌పీ ఎస్సై ఎం.వై. మొహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వృద్ధుడు కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-1లో కి.మీ.నంబర్ 324/34-36 వద్ద మృతిచెందాడు. కాజీపేటలో రైలు దిగి లిఫ్ట్ వద్ద గల గద్దె పక్కన నిద్రిస్తూ నిద్రలోనే మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. మృతుని వద్ద కళ్యాణ్ జంక్షన్ -కాజీపేట జంక్షన్ వరకు రైలు టికెట్ ఉంది. మృతుడు చామన చాయ రంగు, తెలుపు తల వెంట్రుకలతో, బ్లూ కలర్ షర్టుపై వైట్ లైన్స్, సిమెంట్ కలర్ ప్యాంట్, జంజరంతో ఉన్నాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు కాజీపేట జీఆర్పీలో లేదా మొబైల్ నంబర్ 87126 5809, 99498 59108 లలో సంప్రదించాలన్నారు.

వివాహిత అదృశ్యం



లక్ష్మి

హసన్‌పర్తి : కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక నగర్‌కు చెందిన వివాహిత మేకల లక్ష్మి(34) అదృశ్యమైంది. మంగళవారం తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు లక్ష్మి మామ మేకల మల్లయ్య తెలిపారు. కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ సీ ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ కాశిబుగ్గ ఓ సిటీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం జమదగ్ని ముని రేణుకా ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు పట్నం వేసి ఎల్లమ్మ కథను వినిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణ తంతును తిలకించి పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో సౌందర్యలహరి స్తోత్రం, శివానందలహరి పారాయణం

వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీవిశ్వేశ్వరాలయంలో ఓరుగల్లు సౌందర్యలహరి భక్త మండలి బృందంచే మంగళవారం సౌందర్యలహరి స్తోత్రం, శివానందలహరి పారాయణం ఆలపించారు. ఆలయంలో 50 మందిగల సభ్యులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దీపారాధన చేసి సాముహికంగా పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు కె శోభారాణి, పి.జయశ్రీ, కమిటీ సభ్యులు బయ్య స్వామి, గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొమురయ్య, బొడకుంట్ల వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు

ఖిలా వరంగల్ : వరంగల్‌లోని రంగశాయిపేటలో ప్రతిష్ఠించిన గ్రామ దేవత బొడ్రాయికి సోమవారం స్థానికులు పూజలు నిర్వహించారు. వేదపండితులు, బొడ్రాయి ఉత్సవ కమిటీ కన్వీనర్ యోగానంద-స్వరూప దంపతుల ఆధ్వర్యంలో బొడ్రాయికి అభిషేకాలు నిర్వహించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రేపు శ్వేతార్కలో సంకట హర చతుర్థి

కాజీపేట : కాజీపేట స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో రేపు(గురువారం) సంకట హర చతుర్థిని పురస్కరించుకుని స్వామివారికి గులాలుతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి నిత్య కల్యాణ వేడుకలతో పాటు మాడ వీధుల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు ఉంటుందన్నారు.

వడ మాలతో ప్రత్యేక అలంకరణ



కాజీపేట : కాజీపేట 63వ డివిజన్ దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన 1,600ల వడలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అంజన్నకు మంగళవారం ప్రీతికరమైన రోజుకావడంతో భక్తులు వడలను మాలగా తయారు చేసి అలంకరించారు. ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తుల కోరిన కోర్కెలు తీరాలని ఆకాంక్షిస్తూ గణపతి హోమం నిర్వహించారు. పూజల అనంతరం స్వామి వారికి అలంకరించిన వడలను భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం రూ.2,60,963



మడికొండ : కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను మంగళవారం లెక్కించారు. ఆలయంలోని తొమ్మిది హుండీలను లెక్కించగా శివాలయంలోని హుండీల నుంచి రూ.2,17,963 రాగా రామలయంలోని హుండీల ద్వారా రూ.42,553 మొత్తం రూ.2,60,963 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి తెలిపారు. దేవాదాయ శాఖ వరంగల్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ యు.శేఖర్ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాసు, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, లక్ష్మివెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు బోనాలు

మామునూరు : ఖిలా వరంగల్ మండలం మామునూరులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం పద్మశాలీలు అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. బొల్లికుంట, మామునూరు గ్రామాలకు చెందిన పద్మశాలీ మహిళలు శాస్త్రోక్తంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం



కాజీపేట : స్పృహతప్పి రోడ్డుపై పడిఉన్న ఓ వృద్ధుడిని మంగళవారం సహృదయ అనాథ ఆశ్రమ నిర్వాహకురాలు ఎండీ యాకూబీ చేరదీశారు. ఖమ్మం పట్టణంలోని బూరన్‌పూర్ విధికి చెందిన వృద్ధుడు మహ్మద్ పాషా (78) మూడేళ్లుగా హనుమకొండ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ రాత్రి వేళల్లో అదాలత్ సెంటర్‌లోని బస్టాపులో నిద్రిస్తుండేవాడు. వారంరోజులుగా ఎండలు మండిపోతుండడంతో సరైన నీరు, ఆహారం దొరక్క ఆరోగ్యం క్షీణించి, స్పృహతప్పి పడిపోయాడు. వృద్ధుడి అవస్థను గుర్తించిన ప్రయాణికులు ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమానికి సమాచారం ఇచ్చారు. ఆశ్రమ నిర్వాహకురాలు యాకూబీ బస్టాపులో పడి ఉన్న వృద్ధుడిని సిబ్బంది సహకారంతో స్నానం చేయించి వస్త్రాలు తొడిగి చికిత్స చేయించారు. వృద్ధుడిని ఆశ్రమంలో చేర్చుకుని సేవలు అందిస్తున్న యాకూబీని స్థానికులు అభినందించారు.